క్లుప్తంగా

నేడు విద్యుత్ అదాలత్

పెంచికల్‌పేట్: మండల కేంద్రంలోని ఎల్కపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో గురువారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ అంజల్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ బిల్లుల సమస్యలు ఉంటే పరిష్కారమవుతాయని, వినియోగదారులు అదాలత్‌ను వినియోగించుకోవాలని కోరారు.

'సిర్పూర్‌లో కాషాయజెండా ఎగురవేస్తాం'

బెజ్జూర్: సిర్పూర్ నియోజకవర్గంలో కాషాయ జెండా ఎగురవేస్తామని బెజ్జూర్ మండలానికి చెందిన మాజీ ఎంపీపీ కోండ్ర మనోహర్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో మంగళవారం నిర్వహించిన జనగర్జన సభలో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ఎన్నికల కమిటీ అధ్యక్షుడు ఈటెల రాజేందర్ ఆధ్వర్యంలో బీజేపీలో చేరినట్లు తెలిపారు. సిర్పూర్ నియోజకవర్గంలో పాల్వాయి హరీశ్‌బాబు ఎమ్మెల్యే అయ్యేందుకు కృషి చేస్తానన్నారు.

బీఎస్పీ పట్టణ ఇన్‌చార్జిగా షబ్బీర్ హుస్సేన్


షబ్బీర్ హుస్సేన్

కాగజ్‌నగర్‌టౌన్: బహుజన సమాజ్ పార్టీ కాగజ్‌నగర్ పట్టణ ఇన్‌చార్జిగా మాజీ కౌన్సిలర్ షబ్బీర్ హుస్సేన్ నియామకమైనట్లు బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యదర్శిగా సిద్దం శ్రీనివాస్, సిర్పూర్ అసెంబ్లీ కమిటీ కార్యదర్శిగా ఎంపీటీసీ మంగీలాల్, సిర్పూర్ అర్బన్ అసెంబ్లీ కమిటీ కార్యదర్శిగా ఎన్. రాజు నియమితులైనట్లు పేర్కొన్నారు.

గ్రంథాలయం సందర్శన


వివరాలు తెలుసుకుంటున్న దేవీసింగ్

రెబ్బెన: గోలేటి టౌన్‌షిప్‌లో సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో కొనసాగుతున్న గ్రంథాలయాన్ని బుధవారం సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ (సీజీజీ) ప్రతినిధి జి.దేవీసింగ్ సందర్శించారు. గ్రంథాలయానికి రోజు వారీగా వచ్చే పాఠకుల వివరాలతో పాటు అందుబాటులో ఉన్న పుస్తకాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజు గ్రంథాలయానికి చదువుకునేందుకు వస్తున్న విద్యార్థులతో మాట్లాడారు. గ్రంథాలయంలో అందుబాటులో ఉన్న సౌకర్యాలపై ఆరా తీశారు. గ్రంథాలయంలో చదువుకొని ఇటీవల పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికైన యువతీయువకుల అభిప్రాయాలు తెలుసుకున్నారు.

మేదరిపేటను సందర్శించిన డీఎల్‌పీవో

దండేపల్లి: మండలంలోని మేదరిపేటను డీఎల్‌పీవో ప్రభాకర్‌రావు బుధవారం సందర్శించారు. పారిశుధ్యం లోపించకుండా చూడాలని, పంచాయతీ సిబ్బందికి సూచించారు. పలు దుకాణాల ఎదుట చెత్తవేయడంతో, సంబంధిత దుకాణ యజమానులకు జరిమానా విధించారు. చెత్తను రోడ్లపై వేయొద్దని, పంచాయతీ చెత్తట్రాక్టర్ వచ్చినప్పుడు అందులో మాత్రమే వేయాలన్నారు. చెత్తను ఎక్కడపడితే అక్కడ పడేసి, పరిసరాలను కలుషితం చేయొద్దన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

లక్సెట్టిపేట: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో లక్సెట్టిపేట మున్సిపాలిటీ పరిధి, మండలం లోని పలు గ్రామాల్లో గల పోలింగ్ కేంద్రాలను లక్సెట్టిపేట సీఐ కృష్ణ, ఎస్సై లక్ష్మణ్, బుధవారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్ సౌకర్యం, వృద్ధులు, దివ్యాంగులకు ర్యాంపులు సౌకర్యంతో పాటు, సమస్యలు ఏమైనా ఉన్నాయా అనే వివరాలపై ఆరా తీశారు.

13న 'చలో ప్రగతిభవన్'

శ్రీరాంపూర్: సింగరేణిలో కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై ఈ నెల 13న చలో ప్రగతిభవన్ కార్యక్రమం చేపట్టినట్లు సింగరేణి కాంట్రాక్టు లేబర్ యూనియన్ సెంట్రల్ ఉపాధ్యక్షుడు పేరం రమేష్ తెలిపారు. నస్పూర్–శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణి కాంట్రాక్టర్ కార్మికులకు ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకతలో కాంట్రాక్ట్ కార్మికులు ఎంతో శ్రమిస్తున్నారని తెలిపారు. సింగరేణిలో 30వేల మంది కాంట్రాక్ట్ కార్మికుల పనిచేస్తున్నారని, వారి శ్రమకు తగ్గ ప్రతిఫలం రావడం లేదని ఆరోపించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్‌రావు ఆధ్వర్యంలో చలో ప్రగతిభవన్ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులంతా పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఆ యూనియన్ శ్రీరాంపూర్ ఏరియా ఇన్‌చార్జి మిట్టపల్లి మొగిలి, నాయకులు సత్రం రమేష్, కొండ వెంకటేష్, వినోద్ కుమార్, అంబాలసాగర్, రణవేణి శ్రీనివాస్, బద్రి శ్రీకాంత్ రవీందర్ పాల్గొన్నారు.

పందులతో పరేషాన్!


నంబాల శివారులో అడవి పందులు ధ్వంసం చేసిన వరి పంట

- పత్తి, వరి పంటలపై నిత్యం దాడులు
- పంటలను రక్షించుకునేందుకు రైతన్న తిప్పలు
- పట్టించుకోని అటవీ అధికారులు

రెబ్బెన: ఆరుగాలం కష్టపడి పంటలను పండించే రైతులను అడవి పందులు ముప్పుతిప్పలు పెడుతున్నాయి. అడవి పందుల బారి నుంచి పంటలను రక్షించుకోవడం రైతులకు కత్తిమీద సాములా మారింది. రెక్కలు ముక్కలు చేసుకొని పంటలను సాగు చేస్తే దిగుబడులు చేతికొచ్చే దశలో అడవి పందులు పంటలను నాశనం చేస్తూ రైతులకు తీవ్ర నష్టాన్ని కలిగిస్తున్నాయి. పంటల రక్షణకు రాత్రివేళ్లలో పంటచేలకు కాపలా వెళ్తున్న రైతులపై పందులు దాడి చేస్తున్న సంఘటనలు సైతం చోటు చేసుకుంటున్నాయి.

పంటలకు తీవ్ర నష్టం

మండలంలోని రైతులు వానాకాలంలో సాగు చేసిన పత్తి, వరి పంటలకు అడవి పందుల బెడద ప్రస్తుతం అధికంగా ఉంది. మండలంలో ఈసారి దాదాపు 25 వేల ఎకరాల్లో పత్తి పంట, 6 వేల ఎకరాల్లో వరిని రైతులు సాగుచేస్తున్నారు. పత్తి పంటలు ప్రస్తుతం మంచి కాత, పూత దశలో ఉండగా, బోర్లు, మోటార్ల కింద సాగు చేస్తున్న వరి పంటలు మరో నెల రోజుల్లో కోత దశకు చేరుకోనున్నాయి. కాగా పత్తి కాయలు తినేందుకు అలవాటు పడిన అడవి పందులు పత్తి పంటలను తీవ్రంగా నాశనం చేస్తున్నాయి. రాత్రివేళల్లో గుంపులుగా పత్తి చేలపై దాడికి దిగుతున్న పందులు పత్తి చెట్లను ధ్వంసం చేయటంతో పాటు కాయలను కొరికి రైతులకు తీవ్ర నష్టాన్ని మిగుల్చుతున్నాయి. దీంతో పంటల దిగుబడిపై తీవ్ర ప్రభావం పడుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. మరో నెలలో కోత దశకు చేరుకోనున్న వరి పొలాల్లో పందులు సంచరిస్తుండటంతో వరిపైరు నేలకొరిగి రైతులకు నష్టాన్ని కలిగిస్తున్నాయి. పందులు తిరిగిన ప్రాంతాల్లో వరి మొత్తం ధ్వంసం అవుతుండటంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రైతుల పాట్లు

అడవి పందుల బారి నుంచి పంటలను కాపాడుకునేందుకు రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. ప్రధానంగా పత్తి, వరి వంటి పంటలపైనే అడవి పందుల దాడులు అధికంగా ఉన్నాయి. దీంతో పంటలను కాపాడుకునేందుకు రైతులు పత్తి చేలు, వరి పొలాల సరిహద్దుల వెంట సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తున్నారు. ఆర్థిక స్థోమత లేని రైతులు చీరలు కట్టి అడవి పందులు పంటల వైపు రాకుండా చర్యలు చేపడుతున్నారు. అయితే చీరలను సైతం పందులు చీల్చుకుంటూ పంట పొలాలపై పడి చేతికందిన పంటలను నాశనం చేస్తున్నాయి. కొన్ని ప్రాంతాల్లో పందుల ఆట కట్టించేందుకు ఉరి అమర్చుతున్నారు. కొంత మంది రైతులు చట్టవిరుద్ధమని తెలిసినా తప్పనిసరి పరిస్థితుల్లో పంటలను కాపాడుకునేందుకు విద్యుత్ వైర్లు సైతం అమర్చుతున్నారు. రైతులు పండించిన పంటలను అడవి పందులు తీవ్రంగా నాశనం చేస్తున్నా అటవీశాఖ అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. అటవీ జంతువులను వేటాడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించే అధికారులు, అడవి పందులను అరికట్టడంలో ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.


రోడ్డుపై అడ్డంగా ఉన్న పశువులు

రోడ్లపైనే పశువులు..!

- ప్రధాన కూడళ్లలో సంచరిస్తున్న వైనం
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

కెరమెరి: మండల కేంద్రంలో రోడ్లపైనే పశువులు సంచరిస్తుండడంతో వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మూగజీవాలు రహదారులనే ఆవాసాలుగా మార్చుకొని, ప్రధాన కూడళ్లలో సేద తీరుతున్నాయి. పశువుల యజమానులను గ్రామ పంచాయతీ అధికారులు హెచ్చరించినప్పటికీ తమ పద్ధతి మార్చుకోవడం లేదు. అధికారుల ఆదేశాలు బేఖాతరు చేస్తూ పశువులను రోడ్లపైనే విడిచిపెడుతున్నారు. అర్ధరాత్రి సమయంలో వీటి సంచారం మరింత అధికంగా ఉంది.

వాహనదారుల తిప్పలు..

ఆదిలాబాద్ –ఆసిఫాబాద్ ప్రధాన రహదారులపై వేగంగా వెళ్తున్న వాహనదారులు పశువుల సంచారంతో అవస్థలు పడుతున్నారు. బస్సుల రాకపోకలకు మరింత ఎక్కువగా ఆటంకం కలుగుతోంది. బస్సు దిగి పశువులను పక్కకు జరిపి బస్సు కదిలించే పరిస్థితులు ఉన్నాయి. కుమురం భీం ఫొటో స్టూడియో, వంతెన, సుల్తాన్‌గూడ, ఏటీఎం కేంద్రం పరిసరాల్లో, బస్టాండ్ ప్రాంతాల్లో, కిరాణా, కిల్లికొట్ల ఎదుట ఎక్కువగా పశువుల సంచారం ఉంది. రోడ్లపైనే మల, మూత్ర విసర్జన చేస్తుండడంతో వేకువజామున వాకింగ్ వెళ్లేవారు ఇబ్బంది పడుతున్నారు. గతంలో పశువుల యజమానులకు జరిమానాలు కూడా విధించారు. అయినా పరిస్థితిలో ఎలాంటి మార్పు రాలేదు. గ్రామ పంచాయతీ, పోలీసు అధికారులు పశువుల యజమానులకు కౌన్సెలింగ్ ఇచ్చి, మూగజీవాలు రోడ్లపై సంచరించకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం



ఇప్పటికే చాలాసార్లు గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో పశువుల యజమానులకు పరిస్థితి వివరించాం. పలు సందర్భాల్లో జరిమానాలు కూడా విధించాం. కానీ మార్పు రావడం లేదు. మరోసారి వార్డు సభ్యులతో మీటింగ్ ఏర్పాటు చేసి యజమానులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తాం. పశువులు రోడ్లపైకి రాకుండా చర్యలు తీసుకుంటాం.

– భీమయ్య, గ్రామపంచాయతీ కార్యదర్శి, కెరమెరి

ఫ్లెక్సీలు, బ్యానర్లు లేకుండా చూడాలి


మాట్లాడుతున్న ఎంపీడీవో మహేందర్

కెరమెరి: మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో ఫ్లెక్సీలు, బ్యానర్లు, హోర్డింగులు, గోడలపై రాతలు లేకుండా చూడాలని ఎంపీడీవో మహేందర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులకు, ఉపాధిహామీ సిబ్బందికి ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామ పంచాయతీ నిధులు విడుదల కాగానే విద్యుత్ చార్జీలు, ట్రాక్టర్ ఈఎంఐలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో ఈజీఎస్ ఏపీవో మల్లయ్య తదితరులు ఉన్నారు.

ఘనంగా ప్రపంచ బాలికల దినోత్సవం


మాట్లాడుతున్న ఎస్సై రమేశ్

సిర్పూర్(టి): మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో బుధవారం మండల కేంద్రంలోని జూనియర్ సివిల్ కోర్టు పారా లీగల్ వలంటరీ ఆధ్వర్యంలో ప్రపంచ బాలికల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిర్పూర్(టి) ఎస్సై దీకొండ రమేశ్ గురుకుల పాఠశాల, కళాశాల విద్యార్థులకు బాలికల సంరక్షణ, హక్కులు, బాధ్యతలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పారా లీగల్ వలంటరీ సభ్యులు వనమాల, న్యాయవాది గంట కల్యాణ్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వన్యప్రాణులను వేటాడితే కఠిన చర్యలు


మాట్లాడుతున్న మజారొద్దీన్

కెరమెరి: వన్యప్రాణులను వేటాడితే క్రమశిక్షణ చర్యలతో పాటు అటవీహక్కు చట్టం కింద కేసులు నమోదు చేస్తామని అటవీ క్షేత్రాధికారి మజారొద్దీన్ అన్నారు. బుధవారం మండలంలోని దేవాపూర్ గ్రామంలో ప్రజలతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ తీగలు అమర్చి అటవీ జంతువులను హతమర్చుతున్నారని, పొలాలకు విద్యుత్ కంచెలు ఏర్పాటు చేస్తున్నారని, అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో అటవీ అధికారులు నాగేశ్వర్‌గౌడ్, రామయ్య తదితరులు ఉన్నారు.

సబ్‌స్టేషన్ ఎదుట రైతుల ఆందోళన


సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

కౌటాల: విద్యుత్ అధికారులు పంటలకు సక్రమంగా విద్యుత్ సరఫరా చేయడం లేదని మండలంలోని గుడ్లబోరి, విజయనగరం, సైదాపూర్, వైగాం గ్రామాల్లోని రైతులు మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ వర్షాలు లేక వరి, మిర్చి పంటలు ఎండిపోతున్నాయని, పగలు విద్యుత్ సరఫరా చేయడం లేదని ఆరోపించారు. రోజుకు రెండు గంటలు మాత్రమే విద్యుత్ సరఫరా చేస్తున్నారని తెలిపారు. లోటట్జేజీ కారణంగా విద్యుత్ మోటార్లు కాలిపోతున్నాయని వాపోయారు. విద్యుత్ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. పంటలు ఎండిపోయే దశలో ఉన్నాయని, విద్యుత్ సక్రమంగా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.

మహిళా చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి


అవగాహన కల్పిస్తున్న సభ్యులు

రెబ్బెన: మహిళల రక్షణ కోసం కల్పించిన చట్టాలపై బాలికలు, మహిళలు అవగాహన కలిగి ఉండాలని షీటీం ఇన్‌చార్జి సునీత అన్నారు. మండలంలోని గంగాపూర్ కేజీబీవీ పాఠశాలలో షీటీం సేవలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మహిళలు, బాలికల రక్షణ కోసం ప్రభుత్వాలు కల్పించిన చట్టాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. మహిళలపై హింస, ఈవ్ టీజింగ్, సైబర్ క్రైం వంటి వాటికి గురైతే వెంటనే షీటీం నంబర్ 8712670564లో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రజిత, ఉపాధ్యాయులు, షీ టీం సభ్యురాలు స్వప్న, శ్రీలత పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల అందజేత

రామకృష్ణాపూర్: క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డు అమరవాది గ్రామానికి చెందిన మూడు కుటుంబాలకు బాల్కఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం నిత్యావసర సరుకులు అందజేశారు. గ్రామానికి చెందిన అమ్మక్క, వెంకటస్వామి, అపర్ణలు ఇటీవల వేర్వేరు కారణాల చేత మృతిచెందగా వారి కుటుంబసభ్యులకు ఫౌండేషన్ సభ్యులు నిత్యావసర సరుకులు అందించారు.

'రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమే'


మాట్లాడుతున్న కోరళ్ల క్రిష్ణారెడ్డి

దహెగాం: రాష్ట్రంలో రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమేనని కాంగ్రెస్ నియోజకవర్గ నాయకుడు కోరళ్ల క్రిష్ణారెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంతో పాటు ఐనం గ్రామంలో పర్యటించారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీ పథకాలపై ప్రజలకు వివరించారు. సిర్పూర్(టి) నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా తనకే టికెట్ వస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

బీఎస్పీలో పలువురి చేరిక


పార్టీలోకి ఆహ్వానిస్తున్న నాయకులు

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని బీఎస్పీ కార్యాలయంలో బుధవారం పలు వార్డుల నుంచి వివిధ పార్టీలకు చెందిన వారు బీఎస్పీలో చేరారు. బీజేపీ జిల్లా కార్యదర్శి దిలీప్‌కుమార్ తన అనుచరులతో కలిసి కాగజ్‌నగర్ పట్టణ ఇన్‌చార్జి షబ్బీర్ హుస్సేన్ ఆధ్వర్యంలో బీఎస్పీలో చేరారు. కాగజ్‌నగర్ 29వ వార్డుకు చెందిన బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు గౌస్, 50 మంది మహిళలు, గంగారామ్, అజీమ్, నాగరాజు, అయ్యుబ్ పాషాలు బీఆర్‌ఎస్ పార్టీని వదిలి బీఎస్పీ తీర్థం పుచ్చుకున్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు మొహ్మద్ ముస్తఫీ హుస్సేన్, కాగజ్‌నగర్ కార్యదర్శి సిద్దం శ్రీనివాస్, పట్టణ ఉపాధ్యక్షుడు తస్నీరు పోచం, మండల అధ్యక్షుడు డొంగ్రి అరుణ్, మండల కార్యదర్శి చినార్కర్ సుధాకర్, పట్టణ కార్యదర్శి షేక్ ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో బతుకమ్మ సంబరాలు

బెజ్జూర్: మండల కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమోన్నత పాఠశాలలో బుధవారం బతుకమ్మ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో విద్యార్థినులు, ఉపాధ్యాయులు బతుకమ్మ ఆడుతూ సంబరాలు చేసుకున్నారు. అనంతరం బతుకమ్మలతో మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు.

బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం


దహెగాం: నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కోనప్ప


పెంచికల్‌పేట్: పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

కాగజ్‌నగర్‌టౌన్: బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. మండలంలోని కాటిపల్లి గ్రామానికి చెందిన బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన పలువురు నాయకులు బుధవారం కాగజ్‌నగర్ పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో కోఆప్షన్ మెంబర్ బషారత్ ఖాన్, సకారాం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

పరామర్శ..

పెంచికల్‌పేట్: మండలంలోని ఎల్కపల్లి గ్రామానికి చెందిన కళావతి, పెంచికల్‌పేట్ గ్రామానికి చెందిన నాగేశ్వర్‌రావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో బుధవారం బాధిత కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే కోనేరు కోనప్ప పరామర్శించారు. అనంతరం అనారోగ్యంతో బాధపడుతున్న రౌతు పెంటయ్యను పరామర్శించి ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట సర్పంచ్ జాజిమొగ్గ శ్రీనివాస్, కోఆప్షన్ సభ్యుడు సాజీద్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు చౌదరి తిరుపతి, నాయకులు డోకే మహేశ్, శ్రీనివాస్, సాజీద్, కొండయ్య, రాజేశ్వర్, సత్యనారాయణ ఉన్నారు.

ప్రెస్‌క్లబ్‌లో..

దహెగాం: మండల కేంద్రంలో నిర్మించిన ప్రెస్‌క్లబ్ భవనాన్ని గత రెండు రోజుల క్రితం ప్రారంభించగా బుధవారం ఎమ్మెల్యే కోనేరు కోనప్ప సందర్శించారు. ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన అంబేద్కర్ గ్రంథాలయంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ విలేఖరులు సమష్టిగా ఉండి భవనం నిర్మించడం హర్షనీయమన్నారు. ఆయన వెంట మండల రైతుబంధు సమితి కన్వీనర్ సంతోష్‌గౌడ్, వైస్ ఎంపీపీ చౌదరి సురేశ్, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు బండ క్రిష్ణమూర్తి, నాయకులు ఉన్నారు.

ఎన్నికల నియమావళి పాటించాలి


మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి

కాగజ్‌నగర్‌టౌన్: ఎన్నికల ప్రవర్తన నియమావళిని జిల్లాలో విధిగా అమలు చేయాలని, ప్రతి ఒక్కరూ అధికారులకు సహకరించాలని జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. బుధవారం కాగజ్‌నగర్ ఆర్డీవో కార్యాలయంలో రాజకీయ పార్టీల నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. శాసనసభ ఎన్నికల నేపథ్యంలో కార్యాచరణ విడుదలైన సందర్భంగా నియోజకవర్గంలో ఎన్నికల నియమావళి అమలు చేయాలన్నారు. ఓటర్ల జాబితాల్లో ఏమైనా లోపాలు ఉంటే సత్వరమే అధికారుల దృష్టికి తీసుకొస్తే సవరించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

ఎన్‌సీసీ క్యాంపులో విద్యార్థుల ప్రతిభ

జన్నారం: 32వ బెటాలియన్ ఆదిలాబాద్ ఎన్‌సీసీ క్యాంపులో భాగంగా ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో పది రోజుల పాటు నిర్వహించిన ఎన్‌సీసీ క్యాంపులో 600మందిలో పాల్గొని జన్నారం మండలం స్లేట్ హైస్కూల్‌కు చెందిన పలువురు విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. జేడబ్ల్యూ విభాగంలో తొమ్మిదో తరగతి చదువుతున్న మేతరి కీర్తన డ్రిల్లింగ్ విభాగంలో మొదటి ర్యాంకు సాధించినట్లు హెచ్‌ఎం శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. జాజల దియా, సోనాలి ఆర్‌డీసీ మొదటి కాంపిటీషన్ ముగించుకుని, రెండో కాంపిటీషన్‌కు ఎంపికయ్యారని తెలిపారు. ఇందులో ఆరు విభాగాలుంటాయని ఆరు విభాగాలు పూర్తి చేసుకున్నవారికి జనవరి 26న ఢిల్లీలో నిర్వహించే పరేడ్‌కు ఎంపికవుతారని పేర్కొన్నారు. ఫైరింగ్ విభాగంలో లసిక, సైనిక, సహస్ర, ఆంజనేయ విధాత్రి, సోనాలిలు మొదటి ర్యాంకు సాధించినట్లు తెలిపారు. విద్యార్థులను హెచ్‌ఎం, వైస్ ప్రిన్సిపాల్ పూజ, సిబ్బంది అభినందించారు.

ఎన్నికల విధులను సక్రమంగా నిర్వర్తించాలి

బెల్లంపల్లి: అసెంబ్లీ నియోజకవర్గం బెల్లంపల్లిలో ఎన్నికల ప్రవర్తన నియమావళిలో భాగంగా ప్రతీ అధికారి విధులను సక్రమంగా నిర్వర్తించాలని అసెంబ్లీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాహుల్ సూచించారు. స్థానికంగా బుధవారం ఎన్నికల అధికారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎంసీసీ, ఎఫ్‌ఎస్‌టీ, ఎస్‌ఎస్‌టీ, వీవీటీ, వీఎస్‌టీ టీమ్‌లలో విధులు నిర్వర్తించే అధికారులు, సెక్టోరల్ అధికారులు అత్యంత బాధ్యతాయుతంగా పనిచేయాల్సి ఉంటుందన్నారు. కేటాయించిన, నిర్వర్తించాల్సిన విధుల గురించి వివరించారు. అసెంబ్లీ నియోజకవర్గంలో క్షేత్రస్థాయి పరిశీలన చేసి వాల్‌పోస్టర్లు, గోడల మీద రాయించిన రాతలను తొలగించాలని ఆదేశించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఉల్లంఘించిన వారిపై ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుధాకర్, మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, ఇతర అధికారులు పాల్గొన్నారు.